బంగ్లాలో సైనిక తిరుగుబాటు!

ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా

- బంగ్లాదేశ్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం
- సోదరితో కలిసి భారత్‌కు పరారైన హసీనా
- ఆర్మీ అల్టిమేటంతోనే పదవికి గుడ్ బై!
- తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్టు ఆర్మీ చీఫ్ వాకర్ ఉజ్ జమాన్ ప్రకటన
- ప్రధాని నివాసాన్ని లూటీ చేసిన ఆందోళనకారులు

ప్రధాని ప్యాలెస్‌ను చుట్టుముట్టి జాతీయ జెండాను ఎగరవేస్తున్న ఆందోళనకారులు

ఢాకా, ఆగస్టు 5: బంగ్లాదేశ్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం తలెత్తింది. దేశంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అల్లర్లు పతాక స్థాయికి చేరడంతో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఆమె చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా మొదలైన ఉద్యమం చివరకు ఆమెనే గద్దె దింపింది. ప్రపంచంలోనే ఎక్కువ కాలం ప్రభుత్వాధినేతగా పనిచేసిన మహిళగా ఘనత వహించిన హసీనా ప్రజా ఉద్యమానికి జడిసి పదవిని వదులుకున్నారు. ఎన్నికల్లో తిరుగులేని ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అవమానకర రీతిలో దేశాన్ని వీడి పరారయ్యారు. దీంతో బంగ్లాదేశ్ సైనిక పాలన దిశగా అడుగులు వేస్తోంది. దేశాన్ని సైన్యం ఆధీనంలోకి తీసుకుంటున్నది. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్లు ఆర్మీ చీఫ్ ప్రకటించారు. మరోవైపు హసీనా స్వదేశం నుంచి పరారై భారత్‌కు చేరారు.

ఎసరు తెచ్చిన 30 శాతం రిజర్వేషన్లు

1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పోరాడిన వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని హసీనా ప్రభుత్వం 2018లో నిర్ణయించింది. అప్పుడు తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ ప్రతిపాదనను పక్కనపెట్టింది. అయితే, రిజర్వేషన్లు కల్పించాలని ఈ ఏడాది జూన్‌లో హైకోర్టు తీర్పు ఇవ్వడంతో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు 'స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్' అనే పేరుతో జూలైలో ఉద్యమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల్లో ప్రారంభమైన ఈ ఉద్యమంలో క్రమంగా రోడ్లపైకి చేరి హింసాత్మకంగా మారింది. పోలీసుల కాల్పుల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు, నిరసనకారులు మరణించారు. దీంతో జూలై 21న 30 శాతం రిజర్వేషన్లను ఐదు శాతానికి కుదించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ నిరసనకారులు శాంతించలేదు.

ఆర్మీ అల్టిమేటంతోనే రాజీనామా?!

హసీనా రాజీనామాకు పట్టుబడుతూ మూడు రోజులుగా ఆందోళనకారులు దేశంలో రోడ్లపై నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యమంపై హసీనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించింది. మూడు రోజుల్లో దాదాపు 100 మంది ఆందోళనకారులు పోలీస్ కాల్పుల్లో మరణించారు. ఇది వారిలో మరింత ఆగ్రహానికి కారణమైంది. దీంతో సోమవారం ఆందోళనకారులు ఢాకాకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చారు. ఢాకా ప్రధాన వీధుల్లో వందలాది మంది గుమిగూడారు. దీంతో మరోసారి పోలీసులు కాల్పులు జరపగా ఆరుగురు నిరసనకారులు మరణించారు. ఇంతలో అనూహ్యంగా సోమవారం ఉదయం షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆమె ఉన్నఫళంగా ఢాకాను వీడి సైనిక విమానంలో భారత్‌కు పయనమయ్యారు. అయితే 45 నిమిషాల్లో పదవికి రాజీనామా చేసి, దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని ఆర్మీ ఇచ్చిన అల్టిమేటంతోనే ఆమె పదవిని వదులుకున్నారని తెలుస్తోంది.

ముజిబుర్ విగ్రహాన్ని బద్దలు కొట్టి సంబరాలు

ప్యాలెస్ లోపల సేద తీరుతున్న యువకులు

హసీనా రాజీనామా విషయం తెలుసుకొని నిరసనకారులు సంబరాలు చేసుకున్నారు. ప్రధాని నివాసం గణ భవన్‌లోకి ప్రవేశించి ఫర్నీచర్‌ను, ఇతర సామాగ్రిని లూటీ చేశారు. హసీనా దుస్తులనూ ఎత్తుకెళ్లారు. హసీనా తండ్రి, బంగబంధుగా పేరొందిన ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని సైతం నిరసనకారులు బద్దలు కొట్టారు. హసీనా పార్టీ కార్యాలయాన్ని తగలబెట్టారు. హోంమంత్రి అసదుజ్జమన్ ఖాన్ ఇంటిని ధ్వంసం చేశారు. బంగ్లాదేశ్ పార్లమెంటులోకి ప్రవేశించి బీభత్సం సృష్టించారు. దేశవ్యాప్తంగా నాలుగు హిందూ ఆలయాలపైనా దాడి జరిగింది. అయితే ఈ పరిస్థితిని ఉపయోగించుకొని ఎవరూ దేశాన్ని దోచుకునేందుకు అవకాశం ఇవ్వొద్దని విద్యార్థి ఉద్యమ నేతల్లో ఒకరైన నహీద్ ఇస్లాం.. బంగ్లా ప్రజలను కోరారు.

ఢాకాలో బంగ్లాదేశ్ మెమోరియల్ మ్యూజియంకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు

తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు: ఆర్మీ చీఫ్

హసీనా రాజీనామా, దేశాన్ని వీడిన విషయాన్ని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వాకర్ ఉజ్ జమాన్ ప్రకటించారు. దేశానికి సంబంధించి తాను అన్ని బాధ్యతలు తీసుకుంటున్నానని, అందరూ సహకరించాలని ఆయన కోరారు. దేశం ఇప్పటికే చాలా ఇబ్బంది పడుతున్నదని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని, చాలామంది మరణించారని చెప్పారు. దేశంలో ఎమర్జెన్సీ విధించాల్సిన అవసరం లేదని, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్టు ప్రకటించారు.

హసీనా పయనం బ్రిటన్‌కా?

ఉన్నఫళంగా సైనిక విమానంలో తన సోదరి షేక్ రెహానాతో కలిసి ఢాకా నుంచి బయలుదేరిన షేక్ హసీనా ఢిల్లీ సమీపంలోని హిండన్ ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ అయ్యారు. అయితే, ఆమె భారత్ నుంచి లండన్‌కు వెళ్లనున్నారనే వార్తలు వస్తున్నాయి. అయితే, భారత్‌లో ఆశ్రయం పొందడం హసీనాకు కొత్త కాదు. 1975లో హసీనా తండ్రి హత్య జరిగినప్పుడు ఆమె భారత్‌లోనే ఆశ్రయం పొందారు.

భారత్ అప్రమత్తం.. భద్రత కట్టుదిట్టం

షేక్ హసీనా రాజీనామా, బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తమైంది. భద్రత వ్యవహారాలకు సంబంధించిన క్యాబినెట్ కమిటీతో సోమవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నివాసంలో భేటీ అయ్యారు. హసీనాతో భారతదేశ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సమావేశమయ్యారు. బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ - బంగ్లా సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం హై అలెర్ట్ ప్రకటించింది. బంగ్లాదేశ్‌కు వెళ్లే అన్ని రైళ్లు, విమానాలు రద్దయ్యాయి.

ఇక రాజకీయాలకు గుడ్‌బై!

షేక్ హసీనా(78) ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్టు ఆమె కుమారుడు సాజీబ్ వాజేద్ తెలిపారు. దేశాన్ని హసీనా ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు.

ఎగసి 'పడిన' కెరటం



బంగ్లాదేశ్ ప్రధానిగా ఎక్కువ కాలం పని చేసిన రికార్డు షేక్ హసీనాది. 1975లో హసీనా తండ్రి రెహ్మాన్, తల్లి, సోదరులు హత్యకు గురైనప్పుడు హసీనా, ఆమె సోదరి రెహానా జర్మనీలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. అప్పుడు ఆరేండ్ల పాటు ప్రవాస జీవితం గడిపిన తర్వాత 1981లో ఆమె అవామీ లీగ్ పార్టీ నాయకత్వ బాధ్యతలు తీసుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చాక అనేక నిర్బంధాలను ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. 1991 ఎన్నికల్లో ఓడిపోయినా.. 1996 ఎన్నికల్లో గెలిచి మొదటి సారి ప్రధాని అయ్యారు. 2001 ఎన్నికల్లో మళ్లీ బీఎన్‌పీ చేతిలో ఓటమి చవిచూశారు. 2009లో మరోసారి ప్రధాని అయిన హసీనా అప్పటినుంచి 15 ఏండ్లుగా అప్రతిహతంగా నాలుగు పర్యాయాలు గెలిచి ప్రధానిగా కొనసాగారు. హసీనాపై 19 సార్లు హత్యాయత్నాలు జరిగాయి. 2004లో గ్రనేడ్ దాడి నుంచి ఆమె తృటితో తప్పించుకున్నారు. ఆర్థిక సంస్కరణలు చేపట్టి బంగ్లాదేశ్ దిశ, దశను మార్చారని ఆమె పేరు తెచ్చుకున్నారు. సైన్యం పెత్తనం, తిరుగుబాట్లతో దేశంలో ప్రజాస్వామ్యం పూర్తిగా కనుమరుగవుతున్న వేళ బంగ్లా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. అయితే, అదే స్థాయిలో ఆమె నియంతృత్వ శైలిని ప్రదర్శించారనే విమర్శలూ ఉన్నాయి.

కన్వర్ యాత్రలో విషాదం

కరెంట్ షాక్‌తో 9 మంది మృతి

హాజీపూర్: బీహార్‌లోని వైశాలి జిల్లాలో జరుగుతున్న కన్వర్ యాత్రలో విషాదం చోటుచేసుకొన్నది. విద్యుదాఘాతంతో తొమ్మిది మంది భక్తులు మరణించగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారు ప్రయాణిస్తున్న వాహనం హైటెన్షన్ విద్యుత్తు లైన్‌ను తాకడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. జలాభిషేకం నిర్వహించేందుకు భక్తులు సోనేపూర్‌లోని బాబా హరిహర్ నాథ్ ఆలయానికి వెళ్తుండగా సుల్తాన్‌పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి 11.15 గంటలకు ఈ దుర్ఘటన జరిగిందని వైశాలి జిల్లా కలెక్టర్ యష్పాల్ మీనా తెలిపారు. గాయపడిన వారిని దవాఖానకు తరలించామని, వారిద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. బాధితులంతా వైశాలి, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు.

మహారాష్ట్రలో పోటీపై నెలాఖరులో నిర్ణయం

మరాఠా ఉద్యమ నేత జరాంగే

జాల్నా, ఆగస్టు 5: ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ తరఫున పోటీ చేయగలిగే అభ్యర్థుల డాటా అందుబాటులోనే ఉందని మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జారంగే తెలిపారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయమని తమను బలవంతం చేయవద్దని ఆయన కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 29న తమ సామాజికవర్గ నేతలతో సమావేశమై 288 స్థానాలున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా? అన్న విషయాన్ని నిర్ణయిస్తామని తెలిపారు.

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా బెంగాల్ అసెంబ్లీ తీర్మానం

కోల్‌కతా, ఆగస్టు 5: రాష్ట్రాన్ని విభజించే ఏ ప్రయత్నాన్ని అయినా వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ సోమవారం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. సభలో సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ సహకార సమాఖ్య వ్యవస్థను తాము విశ్వసిస్తామని, రాష్ట్రాన్ని విభజించే ఏ ప్రయత్నాన్నైనా వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన ప్రయత్నాలను తాము కూడా వ్యతిరేకిస్తామని బీజేపీ పక్ష నేత సువేందు అధికారి పేర్కొన్నారు. ఒక లైన్‌ను తీర్మానంలో చేర్చాలన్న ఆయన ప్రతిపాదనను సీఎం అంగీకరించడంతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

ఐదేండ్లలో 100 హార్టికల్చర్ క్లస్టర్లు

కేంద్రమంత్రి చౌహాన్

న్యూఢిల్లీ: రైతులకు వ్యవసాయం ద్వారా ఆదాయాన్ని పెంచేందుకు ఓ రోడ్‌మ్యాప్‌ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం పార్లమెంటులో ప్రకటించారు. ఎగుమతి చేయడమే లక్ష్యంగా ఉండే 100 హార్టికల్చర్ క్లస్టర్లను రానున్న ఐదేళ్లలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటి కోసం రూ.18,000 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ రైతులకు మేలు చేసే చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. నెహ్రూ, ఇందిర స్వాతంత్ర్య దినోత్సవాల ప్రసంగాల్లో రైతులు అనే మాట ఎప్పుడూ కనిపించలేదని ఆయన విమర్శించారు.

సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తే న్యాయ పోరాటం

'ముడా'పై కర్ణాటక మంత్రి పరమేశ్వర

బెంగళూరు, ఆగస్టు 5: ముడా కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇస్తే అన్నారు. దానిపై న్యాయ పోరాటం చేస్తామని హోం మంత్రి పరమేశ్వర తెలిపారు. మరోవైపు ముడా స్కామ్ సూత్రధారి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెంటనే రాజీనామా చేయాలంటూ విపక్ష పార్టీలైన బీజేపీ, జేడీ(ఎస్) చేపట్టిన వారం రోజుల నిరసన పాదయాత్ర సోమవారం నాటికి మూడో రోజుకు చేరింది.

బ్లాక్ డేగా '370' రద్దు దినం

రాష్ట్ర హోదా పునరుద్ధరణకు పీడీపీ డిమాండ్

జమ్ము: జమ్ము కశ్మీరుకు ప్రత్యేక హోదాను కల్పించిన రాజ్యాంగంలోని అధికరణ 370ని రద్దు చేసి ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్, పీడీపీ సోమవారం 'బ్లాక్ డే'గా పాటించాయి. జమ్ము కశ్మీరుకు ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఈ పార్టీలు వేర్వేరుగా నిర్వహించిన నిరసన ప్రదర్శనల్లో డిమాండ్ చేశాయి. కాగా, సోమవారం అమర్‌నాథ్ యాత్ర ను నిలిపేశారు. జమ్ము కశ్మీర్ శాసనసభ ఎన్నికలు సెప్టెంబర్‌లో జరుగుతాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. అధికరణ 370 రద్దు జరిగిన రోజును 'ఏకాత్మ మహోత్సవం'గా బీజేపీ నిర్వహించింది.

చొరబాటుదారులపై కాల్పులు

జమ్ము కశ్మీరులోని నియంత్రణ రేఖ వెంబడి అఖ్నూర్, సుందర్‌బని సెక్టర్లలో చొరబాటుదారులు రెండు బృందాలుగా వస్తున్నట్లు అనుమానించిన సైన్యం కాల్పులు జరిపింది. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది.

'డెత్ చాంబర్లు'గా మారాయి

- కోచింగ్ సెంటర్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఢిల్లీ రావూస్ ఘటన మేల్కొలుపని వ్యాఖ్య

న్యూఢిల్లీ: కోచింగ్ సెంటర్లు 'డెత్ చాంబర్లు'గా మారాయని, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల ఢిల్లీలోని పాత రాజిందర్ నగర్‌లోని రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో ముగ్గురు విద్యార్థులు మరణించడంపై స్వీయ విచారణ జరపాలని కోర్టు నిర్ణయించింది. ఈ సంఘటన అందరికీ మేలుకొలుపు అని వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం నోటీసులు ఇచ్చింది. అవసరమైతే ఈ కోచింగ్ సెంటర్లను మూసేయాలని ఆదేశిస్తామని ధర్మాసనం ఈ సందర్భంగా హెచ్చరించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో ఆశలతో వచ్చి, కఠోరంగా శ్రమించే విద్యార్థుల పట్ల శిక్షణా కేంద్రాలు 'డెత్ ఛాంబర్లు'గా మారాయని ఆవేదన వ్యక్తం చేసింది. కెరీర్ కోసం ఈ శిక్షణ కేంద్రంలో చేరిన ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అందరికీ కండ్లు తెరిపించే సంఘటన అని తెలిపింది. అందుకే ఈ విచారణ పరిధిని విస్తరించాలని భావిస్తున్నామని చెప్పింది. ఈ శిక్షణ కేంద్రాలకు జారీ చేసిన నిబంధనలు ఏమిటి? వాటిని అవి అమలు చేసేలా పర్యవేక్షించే యంత్రాంగం ఏమిటో తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

2023 డిసెంబరులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ శిక్షణ సంస్థల సంఘం చేసిన అప్పీలుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కేసును స్వీయ విచారణకు చేపట్టింది. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు నిబంధనల ప్రకారం తగిన భద్రతా చర్యలు అమలవుతున్నాయో, లేదో పరిశీలించాలని ఢిల్లీ నగర పాలక సంస్థను, అగ్నిమాపక శాఖను హైకోర్టు అప్పట్లో ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ శిక్షణ సంస్థల సంఘం అప్పీల్ చేసింది. ఈ అప్పీల్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఖర్చుల కింద రూ.1 లక్ష చెల్లించాలని ఈ సంఘాన్ని ఆదేశించింది. అగ్ని ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి నిర్దేశించిన భద్రతా చర్యలను, ఇతర నిబంధనలను పాటించకుండా శిక్షణ సంస్థలు పని చేయడానికి అనుమతించరాదని స్పష్టం చేసింది.

వక్ఫ్ బిల్లుపై విమర్శల వెల్లువ

కేంద్రం సవరణలను వ్యతిరేకించిన విపక్ష పార్టీలు • మార్పులు సహించబోమన్న ముస్లిం పర్సనల్ లా బోర్డ్

న్యూఢిల్లీ, ఆగస్టు 5: వక్ఫ్ బోర్డులకు అపరిమిత అధికారాలకు చెక్ పెట్టే దిశగా కేంద్రం కీలక బిల్లును తీసుకురాబోతున్నది. ఇందులో భాగంగా వక్ఫ్ చట్టం-1995 సవరించేందుకు మోదీ సర్కార్ రంగం సిద్ధం చేసింది. వక్ఫ్ చట్టం-1995 సవరణ బిల్లును రూపొందించింది. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేయాలని మోదీ సర్కార్ నిర్ణయానికి వచ్చింది. అయితే ఈ బిల్లు పార్లమెంట్‌లో రాజకీయ సునామీ సృష్టించే అవకాశం కనిపిస్తున్నది. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే, తాము వ్యతిరేకిస్తామని సమాజ్‌వాదీ పార్టీ సోమవారం ప్రకటించింది. శివసేన (ఉద్ధవ్ వర్గం) కూడా బిల్లుపై మండిపడింది. బీజేపీ విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని సీపీఎం ఆరోపించింది. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకూడదని జేఎంఎం అభిప్రాయపడింది. మరోవైపు వక్ఫ్ బోర్డ్‌ల చట్టబద్ధమైన హోదా, అధికారాల్లో జోక్యం చేసుకుంటే సహించబోమని 'ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్' (ఏఐఎంపీఎల్‌బీ) ప్రకటించింది. .



ముసాయిదా బిల్లులో ఏముంది?

'భారత సైన్యం, భారతీయ రైల్వేల తర్వాత భారతదేశంలో మూడో అతి పెద్ద భూ యజమానిగా ఉన్న 'వక్ఫ్ బోర్డు'కు విస్తృత అధికారాలను కట్టబెట్టారు. దాని ఆస్తులు 2009 తర్వాత రెట్టింపు అయ్యాయి' అని ముసాయిదా బిల్లులో కేంద్రం పేర్కొంది. దేశంలో ఇతర మతాలకు చెందిన మఠాలకు, అఖారా, ట్రస్ట్‌లు, సొసైటీలకు లేని విస్తృత అధికారాలు, స్వతంత్ర హోదాను వక్ఫ్ బోర్డులకు కట్టబెట్టారని ప్రతిపాదిత బిల్లులో వివరించారు. తాజా సవరణల ద్వారా వక్ఫ్ ఆస్తులపై కేంద్ర, రాష్ట్ర బోర్డులకు ఉన్న అధికారాలను కట్టడి చేయడం వల్ల వక్ఫ్ బోర్డుల నిర్వహణలో మరింత పారదర్శకత ఏర్పడుతుందని కేంద్రం భావిస్తున్నది. సెంట్రల్, స్టేట్ వక్ఫ్ బోర్డులలో తప్పనిసరిగా మహిళలకు ప్రాతినిథ్యం కల్పించాలని బిల్లు పేర్కొన్నది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణపై పర్యవేక్షణ బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని బిల్లులో ప్రతిపాదించనుంది. వక్ఫ్ బోర్డులు ఏదైనా భూమి లేదా ఆస్తిని తమదిగా ప్రకటించటం ద్వారా పలు వివాదాలు, అధికార దుర్వినియోగానికి కారణమవుతున్నాయని కేంద్రం తెలిపింది. బిల్లు చట్టరూపం దాల్చితే.. వక్ఫ్ బోర్డులు మునుపటిలాగా ఏ ఆస్తిని స్వచ్ఛందంగా తమ ఆస్తిగా ప్రకటించుకోలేవు.

వక్ఫ్ చట్టం అంటే ఏమిటి?

దేశంలో మొదటిసారిగా వక్ఫ్ చట్టాన్ని 1954లో తీసుకొచ్చారు. అనంతరం దానికి మరిన్ని అధికారాలు కట్టబెడుతూ 1995లో చట్టాన్ని సవరించారు. 2013లో మరోసారి సవరించారు. ఇందులో పేర్కొన్న నిబంధనల ప్రకారం, ఏ కోర్టుల్లోనూ సవాల్ చేయలేని విధంగా, ఎవరి ఆస్తులనైనా స్వాధీనం చేసుకునే ప్రత్యేక అధికారాలు బోర్డులకు కల్పించారు. నేడు దేశంలో 30 వరకు వక్ఫ్ బోర్డులున్నాయి. తమిళనాడులోని వక్ఫ్ బోర్డు తాజాగా ఓ గ్రామం మొత్తం తమదేనంటూ ప్రకటించటం వివాదానికి దారి తీసింది.

పదో తరగతి బాలుడు.. మోసాల్లో ఘనుడు

- విలాసాల కోసం పోటీ పరీక్షల పేపర్ల బేరం!

ఇండోర్: జీవితాన్ని విలాసంగా గడపాలనుకున్న ఓ పదో తరగతి విద్యార్థి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసే అభ్యర్థులనే బురిడీ కొట్టించాడు. లీకైన మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ పరీక్ష (ప్రిలిమ్స్) ప్రశ్నపత్రాలను విక్రయిస్తానని నమ్మించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. నిందితుడు పదో తరగతి కుర్రాడని తెలిసి ఆశ్చర్యపోయారు. రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాకు చెందిన నిందితుడు జీవితాన్ని విలాసంగా గడపాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఉద్యోగార్థులను మోసం చేయాలనుకున్నాడు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టెలిగ్రాంలో ఓ చానల్‌ను క్రియేట్ చేశాడు. దాని ద్వారా మోసానికి తెరతీశాడు. జూన్ 23న జరగనున్న ఎంపీపీఎస్సీ ప్రిలిమినరీ రౌండ్ పేపర్లు లీకయ్యాయని, అవి తన వద్ద ఉన్నాయని ప్రచారం చేశాడు. ఒక్కో దాన్ని రూ.2,500 విక్రయిస్తానని బేరం పెట్టాడు. ఇలా ఐదుగురిని మోసం చేశాడు. నిజానికి అతడి వద్ద ఎలాంటి పేపర్లు లేవని పోలీసులు తెలిపారు. అతడికి నోటీసులిచ్చి కేసును దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు నీట్ పేపర్ విక్రయిస్తానని గతంలోనూ మోసానికి పాల్పడ్డాడని, ఆ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్నదని పోలీసులు తెలిపారు.

గో సంరక్షణపై చేతలేవి?

కేంద్రంపై టీఎంసీ ఎంపీ ఘోష్ విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 5: బీజేపీ దాని అనుబంధ సంస్థలు నిత్యం గోవుల గురించి, వాటి రక్షణ గురించి మాట్లాడతాయే తప్ప వాటికి సరైన దాణా సమకూర్చడంతో, వాటికి వచ్చే వ్యాధుల నుంచి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సయోని ఘోష్ విమర్శించారు. దేశంలోని 70 శాతం గ్రామీణ ప్రాంతాలు ఇదే రంగంపై ఆధారపడి జీవిస్తున్నా, దీనికి అతి తక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారని విమర్శించారు. కోళ్ల, పశువుల దాణా ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు.

వర్షాలతో ఉత్తరాది కుదేలు

కేదార్‌నాథ్‌లో 130 మందిని రక్షించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 5: దేశంలోని కొన్ని రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఉత్తరాఖండ్‌లో కురిసిన భారీ వర్షాలు, కొండ చరియలు కూలిన ఘటనల్లో కేదార్‌నాథ్ ధామ్‌లో చిక్కుకుపోయిన 130 మంది యాత్రికులను భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సోమవారం సురక్షితంగా తరలించింది. రాజస్థాన్, గుజరాత్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లోనూ వర్షాలు ప్రజల జీవనంపై ప్రభావం చూపించాయి.

మ్యాజిక్ మష్రూమ్‌లతో మానసిక ఆరోగ్య చికిత్స!

న్యూఢిల్లీ: వివిధ రకాల మానసిక అస్వస్థతలకు చికిత్స కోసం మ్యాజిక్ పుట్టగొడుగుల్లోని(మష్రూమ్) సిలోసిబిన్ ఉపయోగపడే అవకాశం ఉందని తాజా అధ్యయనం అంచనా వేస్తున్నది. సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 'నేచర్' జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది. ఈ అధ్యయనంలో పాల్గొన్న ప్రతి వ్యక్తికి 18 ఎఫ్‌ఎంఆర్ఐ స్కాన్స్ తీశారు. వేర్వేరు బ్రెయిన్ నెట్‌వర్క్‌ల మధ్య కమ్యూనికేషన్ పెరిగినప్పటికీ, అప్పటికే ఏర్పాటైన నెట్‌వర్క్‌లలో మెదడులోని వేర్వేరు భాగాల మధ్య అనుసంధానం దెబ్బ తిన్నట్లు కనిపించింది. దీనిని బట్టి మెదడు ద్వారా సమాచారం ప్రాసెస్ అవడాన్ని అంచనా వేయగలిగే సామర్థ్యాన్ని సిలోసిబిన్ తగ్గిస్తుందని, క్రమరహిత స్థితిని సృష్టిస్తుందని తెలుస్తున్నది. అయితే ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిలో దీర్ఘకాలంలో మెరుగుదల కనిపించలేదు.

ఆక్సిజన్ తగ్గినప్పుడు బీపీని పెంచే కెమికల్స్



న్యూఢిల్లీ: ప్రాణవాయువు (ఆక్సిజన్) స్థాయి తక్కువగా ఉన్నపుడు, మెదడులో తయారయ్యే రెండు రసాయనాలు రక్తపోటును పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని కొత్త అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం ప్రకారం ఈ రసాయనాల్లో ఒకటి ఆక్సిటోసిన్ కాగా, మరొకటి కార్టికోట్రోపిన్ రిలీజింగ్ హార్మోన్ (సీఆర్‌హెచ్). ఆక్సిటోసిన్‌ను లవ్ హార్మోన్ అని కూడా పిలుస్తారు. ఇది రక్తపోటు, పరస్పర సంబంధాలు, సాంఘిక అనుబంధాలను ప్రభావితం చేస్తుంది. అదే విధంగా ఒత్తిడికి గురైనపుడు స్పందించడం, ప్రవర్తనలో సీఆర్‌హెచ్ చెప్పుకోదగ్గ పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా ఆరోగ్యానికి హాని కలిగించే వాటిని గుర్తించి, తొలగించే ప్రక్రియలో కూడా ఇది ప్రముఖంగా వ్యవహరిస్తుంది. మస్తిష్క మూలంపై ఈ రెండు హార్మోన్లు చూపించే ప్రభావం గురించి తెలుసుకోవడం కోసం ఈ అధ్యయనం జరిగింది. ఈ నివేదికను జర్నల్ ఆఫ్ సైకాలజీలో ప్రచురించారు.

టోల్ ఫీజు వసూలుకు మినహాయింపులు లేవు

- 60 కి.మీ. పరిధిలో రెండు టోల్ ప్లాజాలు ఉండొచ్చు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై గల టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరి నిలిచిపోయినపుడు, ఆ బారుల పొడవు నిర్దేశిత దూరం మించినపుడు లేదా వేచి ఉండాల్సిన సమయం నిర్దేశిత పరిమితిని దాటినపుడు, టోల్ రుసుము చెల్లింపును మినహాయించే నిబంధనలేవీ లేవని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ సోమవారం పార్లమెంటుకు తెలిపింది. జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల మధ్య దూరం 60 కిలోమీటర్ల కన్నా తక్కువ ఉండవచ్చునని సంబంధిత నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని చెప్పింది. లోక్‌సభలో ఇద్దరు సభ్యులు వేర్వేరుగా అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు సమాధానమిచ్చారు. ఎన్‌హెచ్ ఫీ రూల్స్ అండ్ కన్సెషన్ అగ్రిమెంట్ ప్రకారం 60 కి.మీ. పరిధిలో ఒకటి కన్నా ఎక్కువ టోల్ ప్లాజాలు పని చేయవచ్చునని స్పష్టం చేశారు. శాశ్వత వంతెన, బైపాస్, సొరంగం వంటివాటి కోసం ఈ విధంగా మరొక టోల్ ప్లాజా ఉండవచ్చునన్నారు.